క్లుప్తంగా

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ముక్కంటి సేవలో శ్రీకాళహస్తి ఆర్డీఓ


ఆలయం వద్ద ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రయాణం ప్రమాదకరం


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సత్యవేడు: కన్నావరం – సత్యవేడు రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ అన్నారు. శనివారం కన్నావరంలో గుంతల రోడ్డు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మరమ్మతుల పేరుతో రోడ్డు తవ్వి వదిలేయడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉంటోందన్నారు. సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలకు గర్భిణులు, బాలింతలు వెళ్లి రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు మరమ్మతు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దినేష్‌రాజన్, గోవర్ధన్, శ్యామల, అమ్ములు, మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి: ప్రతి మహిళకు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని న్యాయవాది రాజేశ్వరరావు అన్నారు. ఏర్పేడులోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళ కమిషన్ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లింగ వివక్షతపై సమాజంలో సమూల మార్పు వ చ్చేందుకు కృషి చేయాన్నారు. ప్రతి ఒక్కరు దిశయాప్ కలిగి ఉండాలని తెలిపారు. ఇంట్లో ఆడపిల్లలపై వివక్ష తగదన్నారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, ప్రజ్ఞశ్రీ, రాజేష్, శ్రీరామ్, ఏపీఎం కోమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో తెలంగాణ డీజీపీ


ఆలయం వద్ద తెలంగాణ డీజీపీ జితేందర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శనివారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

భగవద్గీత ప్రచారం

సత్యవేడు: ప్రబోధ సేవా సమితి- ఇందూ జ్ఞాన వేదిక సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచార కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పాదలకూరు కమిటీ, పలమనేరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు పెంచల నరసయ్య, గాయత్రి, జాహ్నవి, కొండయ్య, నర్సారెడ్డి, కిరణ్, మాళవిక, పెంచలయ్య, సాయి, తేజస్విని, హరిప్రసాద్, కిష్టయ్య, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శనివారం డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కాళంగి నదిలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు.

SUNDAY SPECIAL

కళామతల్లి తోవలో.. సరస్వతీ సేవలో..

వృత్తి బోధన.. ప్రవృత్తి కళారాధన.. జానపదం, చిత్రలేఖనం, దస్తూరిలో విద్యార్థులతో సాధన.. ఓ వైపు సరస్వతీ సేవ.. మరో వైపు కళామతల్లి తోవలో నిత్యం శ్రమిస్తున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.. కళాకారుడైన ఆయన కంజీర వాయిస్తే పిల్లలు పరుగున బడికి వస్తారు. గళం విప్పితే.. జానపదం ఝల్లుమంటుంది. చైతన్యం, హాస్యం, సందేశం వెల్లివిరుస్తుంది.. ఆటపాటలతో ఆయన చేసే బోధనతో విజ్ఞానం, వినోదం అందుతుంది. సుద్దముక్క చేతబడితే చక్కని చిత్రాలు.. ముత్యాల్లాంటి దస్తూరి జాలువారుతుంది. ఆయన కలం నుంచి కవితలు స్రవిస్తాయి.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్న ఆయనే బుచ్చినాయుడుకండ్రిగ మండలం కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పోలూరు జగన్నాథం.




అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డును అందుకుంటున్న జగన్నాథం, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న జగన్నాథం, కంజీర వేషధారణతో ఉపాధ్యాయుడు పోలూరు జగన్నాథం

- పల్లె పాటలకు ఊపిరి పోస్తున్న ఉపాధ్యాయుడు
- చిత్రలేఖనం, కవితలు రాయడంలో దిట్ట
- పలు అవార్డులు, ప్రశంసలు
- నకల కళా వల్లభుడు జగన్నాథుడు

వరదయ్యపాళెం: బీఎన్‌కండ్రిగ మండలం తల్లారివెట్టు దళితవాడకు చెందిన జగన్నాథం చిన్నప్పటి నుంచి చదువులో సగటు విద్యార్థి. తండ్రి ప్రోత్సాహం, ఉపాధ్యాయుల తోడ్పాటుతో చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టారు. తండ్రి జానపద కళాకారుడు, విద్యావంతుడు కావడంతో తండ్రి ప్రభావంతో జగన్నాథానికి పాటలు పాడడం, కంజీర, డప్పు వాయించడం, కవితలు రాయడం, చిత్రాలు గీయడం వంటబట్టాయి.

ఈ కళల్లో ప్రావీణ్యం

కంజీర వాయిస్తూ జానపద, సామాజిక చైతన్య గీతాలను ఆలపించడంలో ఆయన దిట్ట. వర్తమాన అంశాలపై కవితలు రాయడం, కవి సమ్మేళనాల్లో పాల్గొనడంలో ప్రావీణ్యం ఉంది. టీవీ, తిరుపతి ఆకాశవాణి కార్యక్రమాల్లో పాల్గొని పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆకట్టుకునేలా చిత్రాలు గీయడం, చక్కటి దస్తూరిని విద్యార్థులకు నేర్పడంలో ఆయన నేర్పరి. సామాజిక చైతన్య కార్యక్రమాల్లో భాగంగా బడి పిలుస్తోంది, రోడ్డు భద్రత, ఎయిడ్స్, బాల్యవివాహాలు, అంటరానితనం, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల్లో తన సొంత జానపద గేయాలతో ఎందరినో చైతన్యపరుస్తున్నారు. మంచివక్త కావడంతో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రైవేటు కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుంటారు. వేమన, సుమతి, దాశరథి తదితర శతక పద్యాలు, ప్రముఖుల సూక్తులను అలవోకగా వివరిస్తూ వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను అందిస్తుంటారు.

కళలే మనిషికి సంతోషం



నిద్రపోయేవారు కనేది కల అయితే..నిద్రపోయేవారిని తట్టిలేపేది కళ..కళలు మనిషికి మానసిక వికాసాన్ని, సంతోషాన్ని, ఉల్లాసాన్ని, ఉత్తేజాన్నిస్తాయి. పిల్లలకు ఆటపాటలతో బోధనతో పాటు సామాజిక చైతన్యంతో పేదరికం, నిరక్షరాస్యత, అంటరానితనం లేని నవసమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నదే నా లక్ష్యం.

–పోలూరు జగన్నాథం, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూలు, కల్లివెట్టు

అవార్డులు, ప్రశంసలివీ..


జగన్నాథం అందుకున్న జ్ఞాపికలు

వి.కోట మండలంలో పనిచేస్తున్న సమయంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. శ్రీఅమ్మా భగవాన్ సేవా ట్రస్టు వారిచే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. బైరెడ్డిపల్లి కళాతరంగిణి సంస్థ నుంచి జానపద పాటల పోటీల్లో ప్రథమ బహుమతి పొందారు. శ్రీకాళహస్తి గురుమిత్ర ఫౌండేషన్ వారి నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. భారతీయ దళిత సాహిత్య అకాడమీ, ఢిల్లీ నుంచి అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు దక్కించుకున్నారు. 2016లో జిల్లా విద్యాశాఖ నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. శ్రీకాళహస్తి సిటిజన్ వెల్ఫేర్ ఫోరమ్ వారిచే బెస్ట్ సిటిజన్ అవార్డు లభించింది. కవి సమ్మేళనంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌చే ప్రశంసాపత్రం అందుకున్నారు. 2019 సెప్టెంబరు 5న జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకున్నారు. 2023లో శ్రీశ్రీ కళావేదిక 48 గంటల ప్రపంచ రికార్డు తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో జ్ఞాపిక, ప్రశంసాపత్రంతోపపాటు సత్కారం అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక 2024 సంక్రాంతి సందర్భంగా జానపద స్వరగానంలో ఉత్తమ ప్రతిభా అవార్డు దక్కించుకున్నారు.

నూతన ఎంపీడీఓగా సౌభాగ్యం

ఏర్పేడు: నూతన ఎంపీడీఓగా జీ.సౌభాగ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న గిడ్డయ్య చిన్నగొట్టిగల్లుకు బదిలీపై వెళ్లారు. సౌభాగ్యం వైఎస్సార్ కడప జిల్లా, నందలూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా లోకేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న రంగనాథం తిరుపతి రూరల్ మండలానికి బదిలీపై వెళ్లారు. లోకేశ్వరి తిరుపతి పీఆర్ డివిజన్ నుంచి ఏర్పేడుకు బదిలీపై వచ్చారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం


వెంకన్న కల్యాణం జరుపుతున్న అర్చకులు

సత్యవేడు: పెరటాసి నెల మూడో శనివారం సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువ జామున సామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన జరిపారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనే, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఆ తరువాత శ్రీదేవి , భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి విశేషాలంకరణ చేసి, కల్యాణ మండపంలోని వేదికపై కొలువుదీర్చారు. తులసీ దళాలతో దేవతామూర్తులను సహస్రనామార్చన జరిపారు. అర్చకులు రామమూర్తి, వేణు ఆధ్వర్యంలో భక్తుల గోవింద నామస్మరణలు, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. తిరుమల నుంచి తీసుకువచ్చిన కల్యాణ తలంబ్రాలు, పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. భక్తులు అన్నదానం చేశారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి


చెత్తసేకరణ బుట్టలు అందజేస్తున్న సర్పంచ్ చెంగల్ రాజు

ఏర్పేడు: పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సర్పంచ్ చెంగల్ రాజు అన్నారు. శనివారం మండలంలోని మడిబాకలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లపై చెత్తచెదారాలను విచ్చలవిడిగా వేయకూడదన్నారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

శీతాలాంబ సేవలో మాజీ ఎమ్మెల్యే



భక్తులకు భోజనం వడిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి , అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: కొత్తపేటలోని శీతాలాంబ అమ్మవారిని శనివారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలమంగళం రవి ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆయన్ని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు మాజీ ఎమ్మెల్యే అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల రాజు, వయ్యాల కృష్ణారెడ్డి, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, గరికపాటి చంద్ర, కంఠ ఉదయ్, పులి రామచంద్ర, మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, పాలమంగళం ప్రకాష్, నాగమణి, బాబు, వెంకటేశ్వర్లునాయుడు, కార్తీక్, మహమ్మద్ లోకేష్, దినేష్, సురేష్, యాకూబ్, నజీర్, జగదీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి- కోయంబత్తూరు మధ్య విమాన సర్వీసులు నడపండి

రేణిగుంట: తిరుపతి నుంచి కోయంబత్తూరుకు విమాన సర్వీసులను నడపాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడను మాజీ ఎంపీ గల్లా జయదేవ్, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కోరారు. రేణిగుంట మండలం, కరకంబాడి సమీపంలోని అమర రాజా కంపెనీలోని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వగృహానికి ఆయన శనివారం ఉదయం విచ్చేశారు. తిరుపతి నుంచి అనేకమంది భక్తులు, వ్యాపారులు కోయంబత్తూర్‌కి కారపోకలను సాగిస్తుంటారని, వారందరి కోసం విమాన సర్వీసును ప్రారంభించాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే ఇటీవల గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి అందించారు. వారిద్దరూ రూ.వెయ్యి చెల్లించి పుస్తకాలను కొనుగోలు చేశారు. ఈ పుస్తకాలు అమ్మడం ద్వారా వచ్చే మొత్తాన్ని పేద విద్యార్థుల చదువుకు ఉపయోగిస్తున్నందుకు మాజీ మంత్రి గల్లా అరుణకుమారిని అభినందించారు.

వెంకన్నకు ప్రత్యేకపూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట, కారణి, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లోని ఆలయాల్లో పెరటాసి నెలలో మూడో శనివారం సందర్భంగా భక్తులు వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తి శ్రద్ధలతో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. భక్తులు హారతులిచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మొక్కలు నాటిన కేంద్రమంత్రి



మొక్క నాటుతున్న కేంద్రమంత్రి, చిత్రంలో ఎంపీ గురుమూర్తి

రేణిగుంట: తిరుపతి విమానాశ్రయం ప్రాంగణంలో శనివారం సాయంత్రం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎస్.సురేష్, రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీ ఫణిక్కర్, తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నే, శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రికి వారు వీడ్కోలు పలికారు.

చిరుధాన్యాల సాగుతో అధిక రాబడి


మాట్లాడుతున్న రమేష్

బుచ్చినాయుడుకండ్రిగ: చిరుధాన్యాలైన సజ్జలు, రాగులు, జొన్నలు, కొర్రలు తదితర పంటలను సాగు చేస్తే అధిక రాబడి సాధించవచ్చని ఇక్రిశాట్‌శాఖ మిల్లెట్ స్పెషలిస్టు రమేష్ తెలిపారు. ఆయన శనివారం మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగలో వెలుగు రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో సాగు చేసిన చిరుధాన్యాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అధిక సంఖ్యలో జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారని తెలిపారు. దీనిని నివారించటానికి ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాలను తినాలని తెలిపారు. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో రైతులకు లాభదాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ద్రాక్షయణి, ఏపీఎం మున్నెయ్య, సీసీలు వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి అలంకారంలో బజారు వీధి కన్యకాపరమేశ్వరి


మధురమీనాక్షిగా నల్లగంగమ్మ


గాయత్రిదేవి అలంకారంలో కనకదుర్గమ్మ


అన్నపూర్ణాదేవిగా కనకాచలం కనకదుర్గమ్మ


ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ


చిందేపల్లిలో అన్నపూర్ణాదేవిగా పార్వతీ దేవి


దశదిశలా సంబరాలు

- వివిధ అలంకరణల్లో అమ్మవార్లు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలు చోట్ల అన్నదానాలు
- వాడవాడలా వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు
- దేవాలయాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో దసదిశలా సంబరాలు చేసుకున్నారు. కరుణించు తల్లీ అంటూ భక్తులు అమ్మవారి ఆలయాల్లో బారులు తీరారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజై శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ తపస్సు అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉన్న కనకదుర్గమ్మ గాయత్రిదేవిగా, కనకాచలంపై ఉన్న కనకదుర్గమ్మగా దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని అమ్మవార్లు పలు అలంకారాల్లో దర్శనమిచ్చారు.

అన్నపూర్ణా దేవిగా లలితాదేవి దర్శనం

సత్యవేడు: పట్టణంలోని లలితాదేవి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త రవికుమార్ దేవర్, పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నపూర్ణాదేవిగా పార్వతీ దేవి

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం పార్వతీదేవి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎండీపుత్తూరు ఎల్లమ్మ, పాపానాయుడుపేట భద్రకాళి, కోబాకలో పోలి నాంచారమ్మ, మర్రిమందలో రాజరాజేశ్వరిదేవి, గుడిమల్లంలోని ఆనందవల్లి అమ్మవార్లు అన్నపూర్ణా దేవి అలంకరణలో పూజలందుకున్నారు.

అన్నపూర్ణాదేవిగా కామాక్షిదేవి

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో ఉన్న శ్రీ కామాక్షిదేవి, అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకారానికి పుట్బాల్ రెడ్డి దంపతులు ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త సాయిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మీనాక్షిగా మరగదాంబిక

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో ఉన్న మీనాక్షి అమ్మవారికి మరగదాంబిక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లికొండేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ బాలాజీరెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అన్నపూర్ణగా అవనాక్షమ్మ

నారాయణవనం: సముదాయంలోని అవనాక్షమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కైలాసనాథకోనలోని కామాక్షాంబిక గాయత్రీదేవి, మండల కేంద్రంలోని ద్రౌపదీదేవి రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు.







అన్నపూర్ణగా లలితాదేవి దర్శనం, అన్నపూర్ణాదేవి అలంకరణలో కామాక్షి, మీనాక్షి అలంకరణలో మరకదాంబి, పార్వతీ దేవిగా అవనాక్షమ్మ, గాయత్రీగా కామాక్షాంబిక, రాజరాజేశ్వరిగా ద్రౌపదీదేవి